## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల వివాదాన్ని పరిష్కరించాలి

పెద్ది రెడ్డి డిమాండ్



2లో


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్ ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 24 ఆగస్టు, 2026 | పేజీలు : 06


# బ్లాక్ స్పాట్స్ వద్ద సోలార్ వెలుగులెప్పుడో?

- గద్దెలు నిర్మించి చేతులు దులుపుకున్న వైనం
- ఫిట్టింగ్ మరచి చీకట్లో మగ్గుతున్న జాతీయ, ప్రధాన రహదారులు





**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లావ్యాప్తంగా ప్రధాన రహదారులు, ప్రమాదకర మలుపులు (బ్లాక్ స్పాట్స్) వద్ద నిత్యం పొంచివున్న ప్రమాదాల నివారణకు అధికారులు చేపట్టిన సోలార్ విద్యుత్ దీపాల ఏర్పాటు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి.రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు, రాత్రి వేళల్లో ప్రయాణికులకు సురక్షితమైన దారి చూపేందుకు ప్రధాన కూడళ్లు, గ్రామాల శివారు రహదారుల వెంబడి సోలార్ పోల్స్ బిగించేందుకు కాంక్రీట్ దిమ్మెలు (గద్దెలు) నిర్మించారు. కానీ ఆ దిమ్మెలు నిర్మించి నెలలు గడుస్తున్నా,వాటిపై ఏర్పాటు చేయాల్సిన స్తంభాలు, సోలార్ ప్యానెళ్లు, లైట్ల ఫిట్టింగ్ ఊసే లేకుండా పోయింది.


**జిల్లావ్యాప్తంగా ప్రమాదాల నిలయాలుగా మారుతున్న బ్లాక్ స్పాట్స్ :** జిల్లా పరిధిలోని జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు మండల కేంద్రాలను కలిపే ప్రధాన మార్గాల్లో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రదేశాలను గుర్తించి అధికారులు ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. జిల్లాలో రాత్రి వేళల్లో వెలుతురు లేక మలుపులు కనిపించక,భారీ వాహనాల రాకపోకలతో తీవ్ర ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.రోడ్డు భద్రతపై ప్రజాప్రతినిధులు,అధికారులు చేస్తున్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో నీరుగారిపోతున్నాయి. ప్రమాదాలను నివారించాల్సిన చోట కాంక్రీట్ దిమ్మెలకు ఉన్న పొడవాటి బోల్టులు, ఇనుప రాడ్లు తేలిపోయి రహదారి పక్కనే ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. వాహనాలు ఏమాత్రం అదుపుతప్పినా ఈ ఇనుప రాడ్లు తగిలి తీవ్ర గాయాలయ్యే పరిస్థితి దాపురించింది.నిధులు మంజూరైనా ముందుకు సాగని వైనంప్రభుత్వం నుంచి రహదారి భద్రత నిధులు కేటాయించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పనులు నామమాత్రంగానే సాగాయి.టెండర్ల ప్రక్రియ పూర్తయి గద్దెల నిర్మాణం చేపట్టిన గుత్తేదారులు, అసలైన లైట్ల బిగింపు ప్రక్రియను గాలికొదిలేశారు. జిల్లా వ్యాప్తంగా వందలాది పాయింట్లలో కేవలం పునాదులు వేసి వదిలేయడం అధికారుల పర్యవేక్షణా లోపానికి అద్దం పడుతోంది. సామగ్రి కొనుగోలులో జాప్యమా లేక బిల్లుల చెల్లింపుల్లో అలసత్వమా అన్నది స్పష్టం కావడం లేదు. అధికారులు సమన్వయంతో వ్యవహరించి పనులను పరుగులు పెట్టించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటున్న ప్రయాణికులు :** గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే అంతర్గత రహదారుల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వీధి దీపాలు లేని శివారు ప్రాంతాల్లో, అటవీ మార్గాలను ఆనుకుని ఉన్న రహదారుల్లో ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. వెలుతురు లేకపోవడం వల్ల పశువులు, అడవి జంతువులు అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడం వల్ల ద్విచక్ర వాహనదారులు తీవ్ర ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికితోడు చీకటిని ఆసరాగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

**నిర్లక్ష్యంపై ప్రజలు,వాహనదారుల ఆగ్రహం :** కేవలం సిమెంట్ గద్దెలు వేసి గుత్తేదారులు, సంబంధిత శాఖ అధికారులు చేతులు దులుపుకున్నారని జిల్లా ప్రజలు, వాహనదారులు మండిపడుతున్నారు. నిధులున్నా పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతోందో అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, పెండింగ్‌లో ఉన్న సోలార్ లైట్ల ఫిట్టింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయించి రహదారులపై వెలుగులు నింపాలని ప్రజలు కోరుతున్నారు.

## పేదింటి గృహప్రవేశానికి
# 'వెలిచాల' కానుక

వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాజేందర్ రావు



**ప్రజాపక్షం/కరీంనగర్:** ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశం చేసే పేదింటి ఆడబిడ్డలకు వెలిచాల కానుక పేరుతో తన వంతు సాయం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు వినూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సొంతింటి కల నెరవేరిన వేళ ఆ కుటుంబంతో కలిసి సంతోషాన్ని పంచుకునేందుకు తన వంతుగా ఇండక్షన్ (ఎలక్ట్రిక్) స్టవ్ లేదా బోళ్ళ సెట్ అందజేస్తున్నారు. ఈ వినూత్న కార్యక్రమానికి చామనపల్లి నుంచి శ్రీకారం చుట్టారు. కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లిలో పల్లె జగదీష్–శిరీష దంపతుల

తరువాయి 2 లో...

# వైన్‌షాపుల జోరు.. గీత వృత్తి బేజారు

- మంచిర్యాల జిల్లాలో ఏటా తగ్గుతున్న కార్మికుల సంఖ్య
- ఆదాయం సరిపోక యువత దూరం

**ప్రజాపక్షం/లక్షెట్టిపేట/ మంచిర్యాల :** గ్రామీణ జీవనంలో తరతరాల సంప్రదాయానికి ప్రతీకగా నిలిచిన గీత వృత్తి మంచిర్యాల జిల్లాలో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఒకప్పుడు జిల్లావ్యాప్తంగా 6 నుంచి 7 వేల మంది వరకు ఉన్న గీత కార్మికుల సంఖ్య ప్రస్తుతం 4 వేల లోపునకు పరిమితమైంది. మద్యం దుకాణాల విస్తరణతో కల్లుకు ఆదరణ తగ్గడం, పెరుగుతున్న జీవన వ్యయాలకు సరిపడా రాబడి లేకపోవడంతో కార్మికుల బతుకులు ఛిద్రమవుతున్నాయి. ప్రాణాలను పణంగా పెట్టి చెట్లెక్కినా కుటుంబ పోషణ భారంగా మారడంతో కొత్త తరం ఈ వృత్తి వైపు చూడటం లేదు. కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు పెరగడంతో యువత పట్టణాలకు వెళ్లి చిన్నచిన్న ఉద్యోగాలు, వ్యాపారాల వైపు మొగ్గు చూపుతోంది. వృత్తిలోకి కొత్త తరం రాకపోవడంతోకార్మికుల సంఖ్య పడిపోతోంది.



### తీరని ఆకలి రెట్టింపు కష్టం

వృత్తిని కొనసాగిస్తున్న పెద్దల పరిస్థితి దయనీయంగా మారింది. ఉదయం చెట్లు ఎక్కి కల్లు సేకరించిన తర్వాత వచ్చే ఆదాయం సరిపోక అదనపు జీవనోపాధి కోసం కూలీ పనులకు వెళ్లాల్సి వస్తోంది. వయసు మీద పడినా కుటుంబం గడవడానికి ఇతర పనులు చేయక తప్పడం లేదు. గ్రామాలు,

### మద్యం వెల్లువలో కల్లు గల్లంతు

పట్టణాల్లో వైన్‌షాపుల అందుబాటు పెరగడం కల్లు విక్రయాలను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి, వినియోగదారుల అభిరుచుల్లో మార్పులు, పెరిగిన మద్యం ప్రభావంతో కల్లుకు గిరాకీ గణనీయంగా తగ్గుతుంది. ప్రాణాలకు తెగించి సేకరిస్తున్న కల్లుకు సరైన మార్కెట్, గిట్టుబాటు ధర దక్కడం లేదు,

తరువాయి 2 లో...

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల రద్దు కుట్రలను సహించేది లేదు

### బిఆర్ఎస్ నాయకురాలు శిరీష

**ప్రజాపక్షం / హుజూరాబాద్ :** గత బిఆర్ఎస్ ప్రభుత్వం హుజూరాబాద్ జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని గుర్తించి కేటాయించిన నివేశన స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకునేందుకు కుట్ర పన్నుతోందని బిఆర్ఎస్ నాయకురాలు ఆకినపల్లి శిరీష తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జర్నలిస్టుల స్థలాలపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి కోర్టులో వేసిన కేసు నిరసిస్తూ హుజూరాబాద్ జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరాన్ని ఆదివారం ఆమె సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆకినపల్లి శిరీష మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టులను నేడు రోడ్డున పడేయడం బాధాకరమన్నారు. తమ హక్కుల సాధన కోసం కుటుంబాలను సైతం పక్కనబెట్టి బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో శాంతియుత పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బిఆర్ఎస్ పార్టీ తరుపున జర్నలిస్టులకు స్థలాలు దక్కేవరకు అన్ని విధాలా అండగా ఉండి న్యాయపోరాటం చేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జర్నలిస్టులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గూడూరి సురేశ్‌కు యువ ఎక్స్‌లెన్స్-2026 అవార్డు

**ప్రజాపక్షం / గన్నేరువరం :** గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన వివేకానంద యూత్ అధ్యక్షుడు గూడూరి సురేశ్‌కు ఫ్రెండ్స్ కల్చరల్ అకాడమీ, చిరంజీవి హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువ ఎక్స్‌లెన్స్ అవార్డు2026ను డీఎస్పీ ప్రతాప్, జబర్దస్త్ నటుడు జీవన్, మిలీనియం శ్రీనివాస్, సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ చేతులమీదుగా ఆదివారం అందజేశారు. అనంతరం గన్నేరువరం మండలం ప్రజలు, నాయకులు, యువజన సంఘాలతోపాటు పలువురు ప్రముఖులు గూడూరు సురేశ్‌ను కలిసి అభినందించారు. సురేశ్‌కు అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఇలాంటి అవార్డులు భవిష్యత్‌లో మరెన్నో పొందాలని ఆకాంక్షించారు.

## అనుమతులు లేకుండా ఇసుక తరలింపు

### కేసు నమోదు చేసిన ఎస్ఐ

**ప్రజాపక్షం / గన్నేరువరం :** గన్నేరువరం మండలంలోని చొక్కారావుపల్లె చెందిన బిక్క వాగు నుంచి ఇలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న గన్నేరువరం గ్రామానికి చెందిన బత్తిని నాగరాజు గ్రామంలోని ఎల్లమ్మ గుడి వద్ద ఇసుక ట్రాక్టర్ ను గన్నేరువరం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని గనేరువరం పోలీస్ స్టేషన్‌కు తరలించి సంబంధిత నిబంధనల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గన్నేరువరం ఎస్సై జి.నరేందర్ రెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేపట్టేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



# పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఆకుల సతీశ్

**ప్రజాపక్షం / జమ్మికుంట :** కరీంనగర్ జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా జమ్మికుంటకు చెందిన ఆకుల సతీష్ ఎన్నికయ్యారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికల్లో 34 ప్రతినిధుల నుంచి 13 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారని అధ్యక్షునిగా సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సీపీ గౌష్ ఆలం ప్రకటించారు. జమ్మికుంట ప్రాంతానికి చెందిన వ్యక్తి జిల్లాస్థాయి పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఎన్నిక కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, వైస్ చైర్మన్ జావేద్, సొసైటీ అధ్యక్షుడు పొనగంటి సంపత్, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర రావు, మాజీ సర్పంచ్ పొనగంటి మల్లయ్య తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో పోలీస్ సిబ్బంది సంక్షేమానికి మరింతగా కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.



## ఎఐటియుసి రాష్ట్ర మహాసభల విజయానికి ప్రజానాట్యమండలి వర్క్ షాప్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో కరీంనగర్ లో జరగనున్న ఎఐటియుసి రాష్ట్ర నాలుగవ మహాసభలను విజయవంతం చేయడం కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మరియు మంచిర్యాల జిల్లాల ప్రజానాట్యమండలి వర్క్ షాప్ ను కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి మరియు ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) జాతీయ నాయకులు కవ్వంపల్లి స్వామి పేర్కొన్నారు.ఆదివారం ప్రారంభమైన ఈ వర్క్ షాప్ కు సీపీఐ జాతీయ నాయకులు,మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై సెప్టెంబర్ లో కరీంనగర్ లో జరిగే ఏఐటియుసి రాష్ట్ర మహాసభల్లో కళాకారులు ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల పై పాటలు రాసి వాటిని ప్రాక్టీస్ చేసి కార్మికుల ను చైతన్య పరిచే విధంగా తయారు కావాలని ఆకాంక్షించారు. ఇట్టి వర్క్ షాప్ రెండు రోజులు ఉంటుందని, కళాకారులకు పాటలు పాడటం, ప్రదర్శనల పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కే.స్వామి పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల సీపీఐ కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, తాండ్ర సదానందం, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, పల్లె నరసింహ,కన్నం లక్ష్మీ నారాయణ,ఎజ్జ రాజయ్య,ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శిసమ్మయ్య, హాజరయ్యారు.



# ఆటో కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

### ఎఐటియుసి పెద్దపల్లి డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రెటరీ కడారి సునీల్




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఆటో డ్రైవర్లు ఓనర్లు రోజువారి అడ్డా కూలీలుగా మారుతున్నారని ఉపాధి లేక కుటుంబాలను పోషించుకోలేక ఆటో ఫైనాన్స్ చెల్లించలేక కుటుంబాలను పోషించుకోవడానికి అడ్డ కూలీలుగా, వలస కార్మికులుగా మారుతున్నారని ఎఐటియుసి పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ ఆవేదన వ్యక్తం చేశారు. మార్పు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చినటువంటి హామీలు నెరవేర్చకపోగా ఆటోలు రోడ్డు మీద తిరిగేపరిస్థితి లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల జీవితాలతో చెలగాటం ఆడడం స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు ఆటో డ్రైవర్ల ఆత్మ గౌరవం ఉపాధి హామీ. ఆటో డ్రైవర్ల జీవన్మరణ సమస్య పరిష్కారంపై రాష్ట్రవ్యాప్తంగా 23 తేదీ అర్ధరాత్రి నుండి జరుప తలపెట్టిన ఆటో జేఏసీ బందుకు ఏఐటియుసి పెద్దపల్లి జిల్లా సమితి సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ప్రజలు ప్రజాస్వామిక వాదులు బంద్కు సహకరించాలని కడారి సునీల్ విజ్ఞప్తి చేశారు.

## కుక్కల బెడద; ఫిర్యాదు చేసిన పట్టింపులేదా?

**ప్రజాపక్షం/రామగుండం :** ప్రధాన రహదారిపై నడవాలంటేనే భయం.. రామగుండం వాసుల ఆవేదన ఇది.. ఎక్కడ చూసిన 10 నుంచి 15 కుక్కలు గుంపులు గుంపులుగా కనిపిస్తాయి. కుక్కల సంఖ్య పెరిగాయని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే వారు లేరు. ఒకరిని కరిస్తే, ఒకరి ప్రాణం పోతేనే స్పందిస్తారా?! అని ప్రజలు నగరపాలక అధికారులను ప్రశ్నిస్తున్నారు. రామగుండం పట్టణ మెయిన్ రోడ్డులో వీధి కుక్కల బెడద తీవ్రంగా పెరిగింది. ప్రధాన రహదారిపై గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కల వల్ల స్థానిక ప్రజలు, పాదచారులు, విద్యార్థులు, చిన్నారులు, వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రహదారికి ఇరువైపుల హోటళ్ల, దుకాణాలు, మార్కెట్ ఏరియాలో చెత్త కుప్పల వద్ద కుక్కలు గుమిగూడుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్ పిల్లలు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు నడవడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలువురిని కుక్కలు కరిచిన ఘటనలు జరిగినట్లు స్థానికులు తెలిపారు. బైక్‌పై వెళ్తున్న వారిని వెంబడించడం, రాత్రి వేళల్లో మొరగడంతో అందరికి నిద్ర లేకుండా చేస్తున్నాయి. గుంపులుగా దాడి చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు కూడ జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల నియంత్రణకు రామగుండం నగరపాలక అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, కుక్కలను పట్టుకొని ఆనిమల్ బర్త్ కంట్రోల్‌లో భాగంగా స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టి, మెయిన్ రోడ్‌లో కుక్కల బెడదను తొలగించాలని ప్రజలు కోరుతున్నట్లు స్థానిక నాయకుడు మాడిశెట్టి రవి తెలిపారు.

## తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండం 29వ డివిజన్ ఆదర్శనగర్‌లో నూతన తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించినట్లు కార్పొరేటర్ నిమ్మరాజుల రజని రవి తెలిపారు. కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం పాత పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల ప్రజలకు నిరంతర మంచినీటి సరఫరా అందుతుందన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, మేయర్ మహంకాళి స్వామి, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఠాకూర్ అయోధ్యసింగ్, ఈదునూరి ప్రసాద్‌ల సహకారంతో డివిజన్ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు, ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు కార్పొరేటర్ రజని తెలిపారు.



## వైన్‌షాపుల జోరు.. గీత వృత్తి బేజారు

(మొదటి పేజీ తరువాయి)

దీంతో కష్టానికి తగిన ఫలితం అందడం లేదు, మద్యం దుకాణాల వలన కల్లు తాగేవారి సంఖ్య కూడా రోజు రోజుకు తగ్గుతుంది.

### గౌడ్, గీత కార్మికుడు మ్యాదరిపేట

ప్రాణం పణంగా పెట్టినా పస్తులే గతి ముగింపు దిశగా మోకు ప్రయాణంచెట్టెక్కే సమయంలో జరిగే ప్రమాదాలు కార్మికులను నిత్యం భయపెడుతున్నాయి. ప్రమాదవశాత్తు జారిపడి శాశ్వత అంగవైకల్యం పాలవుతున్నా, ప్రాణాలు కోల్పోతున్నా ఆశించిన స్థాయిలో భరోసా దక్క డం లేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న గీత కార్మికుల ప్రమాద బీమా, ఇతర సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సకాలంలో అందడం లేదు. "గీత వృత్తి కేవలం ఉపాధి మార్గం కాదు తరతరాలుగా కొనసాగుతు న్న జీవన విధానం"సంక్షేమ పథకాలు, ప్రమాద బీమా పరిహారాన్ని త్వరితగతిన విడుదల చేయడంతో పాటు, కల్లు విక్రయాలకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి వృత్తిని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒకప్పుడు వేలాది కుటుంబాలకు జీవనాధారంగా నిలిచిన ఈ సంప్రదాయ వృత్తి నేడు వారసులు లేక మోడువారుతోంది. ఇప్పటికైనా స్పందించి కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా గీత కార్మికులకు శాశ్వత ఆర్థిక భరోసా, రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

## పేదింటి గృహప్రవేశానికి 'వెలిచాల' కానుక

(మొదటి పేజీ తరువాయి)

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆదివారం వెలిచాల రాజేందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన గృహంలోకి అడుగుపెడుతున్న దంపతులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పేద కుటుంబం సొంతింటి గడప తొక్కుతున్న సందర్భం ప్రతి ఒక్కరికీ ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. మొట్టమొదటిసారిగా ఈ దంపతులకు ఇండక్షన్ స్టవ్ తో పాటు బోల్ట సెట్ ను అందజేస్తానని పేర్కొన్నారు.పద్మశాలీ సంఘ భవనానికి సహకారంచామనపల్లిలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో రాజేందర్‌రావును ఘనంగా సన్మానించారు. సంఘ భవన నిర్మాణానికి తనవంతు సహాయం అందించడంతో పాటు, ప్రభుత్వ పరంగా అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలోనూ రాజేందర్‌రావు పాల్గొన్నారు. గౌడ కులస్తుల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

### నెలలోపు ఇల్లు పూర్తి చేసే బాధ్యత

ఇరుకుల్ల గ్రామంలో విజయలక్ష్మి–రామ్‌రెడ్డి దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రాజేందర్‌రావు భూమిపూజ చేశారు. ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేసి నెలలోపు పనులు పూర్తయ్యేలా చూస్తానని, నిర్మాణానికి సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు అందేలా అధికారులతో సమన్వయం చేస్తానని తెలిపారు. అనంతరం ఇరుకుల్లలో కురుమ సంఘం సభ్యులతో కలిసి బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ గుమ్మడి రాజ్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మీసాల శంకర్, జగ్గాని కనకయ్య, కాంగ్రెస్ నాయకులు మూల కృష్ణారెడ్డి అనంతుల రమేష్, పోరండ్ల రమేష్, ఉప సర్పంచ్ గాలిపల్లి రవి, కస్తూరి అశోక్ రెడ్డి,పద్మశాలీ సంఘం అధ్యక్షుడు దూడం మల్లేశం, దాసరి ఆంజనేయులు, భూర్ల లక్ష్మీ రాజం, దికొండ శంకరయ్య, గాజంగి రమేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రతినిధులు, పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల వివాదాన్ని పరిష్కరించాలి

**ప్రజాపక్షం / హుజూరాబాద్ :** గ్రామీణ ప్రాంత సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రజాసేవలో కీలకపాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల నివేశన స్థలాలపై అడ్డంకులు సృష్టించడం సరికాదని మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. హుజూరాబాద్‌లో గత ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి కోర్టులో కేసు వేయడాన్ని నిరసిస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 8వ రోజుకు చేరుకున్నాయి. దీక్షకు ముందు జర్నలిస్టులు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ పార్టీతో పాటు స్వామిరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ మూడేళ్ల క్రితం నిబంధనల ప్రకారం ప్రభుత్వం జర్నలిస్టులకు స్థలాలు కేటాయించిందని గుర్తు చేశారు. పట్టాలు పొందిన జర్నలిస్టులు ఒక్కొక్కరు రూ.లు లక్ష నుండి లక్షన్నర వరకు వెచ్చించి చిన్నపాటి గదులు నిర్మించుకుని విద్యుత్ సౌకర్యం కూడా పొందారని తెలిపారు. వారు నివాసయోగ్యంగా మలుచుకుంటున్న సమయంలో కావాలని కేసు వేసి ఇబ్బందులకు గురి చేయడం తీవ్ర అన్యాయమన్నారు. పార్టీ కార్యకర్తలు తప్పు చేస్తే సరిదిద్దాల్సిన బాధ్యత జిల్లా మంత్రిపై ఉందని ఆయన పేర్కొన్నారు.

## బాలవికాస్ విద్యార్థులకు ముందస్తు రక్షాబంధన్

**ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయి సేవా మందిరంలో ఆదివారం బాలవికాస్ విద్యార్థులకు ముందస్తు రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రక్షాబంధన్ విశిష్టత, సోదర సోదరీమణుల ఆత్మీయ బంధం గురించి విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో బాలవికాస్ గురువులు సుజాత, గణేష్, కన్వీనర్ గూడ రమేష్,భక్తులు రాజశేఖర్,చిన్నారులు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవం

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం మండల,పట్టణ అధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. మండల అధ్యక్షులుగా సాయిని శ్రీనివాస్,పట్టణ అధ్యక్షులుగా పిన్న శ్రీనివాస్ లు ఎన్నికయ్యారు.పట్టణ ఆర్యవైశ్య సంఘం సత్రంలో ఆదివారం నిర్వహించిన అధ్యక్ష ఎన్నికలకు కన్వీనర్ గా సాయిని సత్యనారాయణ, ఎన్నికల అధికారులుగా అక్కనపెల్లి శ్రీనివాస్,రంగ శ్రీనివాస్,సాధు శ్రీకాంత్,దొంతుల శ్రీధర్‌లు వ్యవహరించారు.తమపై నమ్మకముంచి ఎన్నికను ఏకగ్రీవం చేసిన ఆర్యవైశ్య సోదరులకు ఋణపడి ఉంటామని సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు సాయిని శ్రీనివాస్,పిన్న శ్రీనివాస్ లు తెలిపారు. నూతన అధ్యక్షులను ఆర్యవైశ్య సంఘ నాయకులు జక్కు రవీందర్,కూరగాయల సంతోష్,మురికి శ్రీనివాస్ లు ఘనంగా సన్మానించి అభినందించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి మండల కార్ ఓనర్స్, డ్రైవర్స్ యూనియన్ సభ్యుడైన తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గాదె లక్ష్మణ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి యూనియన్ పక్షాన రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.యూనియన్ అధ్యక్షులు అడువాల రాజ్ కుమార్,పేరవేని రాజేష్,కాసారపు వెంకటేష్,పతంజలి విజయ్,భీమ్ శ్రీను,ఉన్నారు.

## విద్యుత్ లైన్ కోసం పచ్చని చెట్లకు గొడ్డలి వేటు

### కరెంటు ఇవ్వాలంటే చెట్లు నరకా?

**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం మొక్కల పెంపకం పథకంలో భాగంగా పర్యావరణాన్ని పరిరక్షించాలనే సంకల్పంతో ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి రోడ్ల పక్కన మొక్కలు నాటుతుంటే విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంతో చెట్లను నరికి వేస్తున్నారు. అల్లాదుర్గం రేగోడు వెళ్లే దారిలో వెంకట్రావుపేట్ శివారులో రోడ్డు కిరువైపులా హరితహారం కింద నాటిన చెట్లను అల్లాదుర్గం శివార్లో కొత్తగా ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ సంస్థ నుండి వెంకట్రావుపేట్ సబ్ స్టేషన్ కు విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ లైన్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డు వస్తున్నాయని అనుమతి లేకుండా చెట్ల కొమ్మలు నరికి వేశారని గ్రామస్తులు తెలిపారు. ఉన్నతాధికారులు కొమ్మలు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## గోదారి ముంపు సమస్యకు పరిష్కారమేది?

### ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్



**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరినదికి భారీ వరదలు వచ్చిన ప్రతిసారి రామగుండం నగరపాలక పరిధిలోని విలేజి రామగుండం, పాములపేట, లింగాపూర్, మేడిపల్లి, మల్కాపురం, సప్తగిరి కాలనీ, ప్రశాంత్‌నగర్, శ్రీనగర్ కాలనీ, గంగానగర్, పవర్‌హౌస్‌కాలనీ వంటి లోతట్టు ప్రాంతాలు వరద ముంపునకు గురవుతున్నాయి. ఈ ప్రాంతాల రక్షణకు కరకట్ట నిర్మిస్తామని, ఒకసారి రూ.130 కోట్లు, ఇంకోసారి రూ.200 కోట్లు, మరొసారి రూ.400 కోట్లు ఖర్చు అవుతుందని, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పడమే తప్ప ఆచరణలో కార్యాచరణ లేకపోవడం దురదృష్టకరమని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ ఆవేదన వ్యక్తం చేశారు. కరకట్ట నిర్మాణం, భూసేకరణకు సంబంధించి సమగ్ర అంచనాలు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలన్నారు. కరకట్ట నిర్మాణం వల్ల గోదావరి తీర పరివాహక ప్రాంతం సుందరంగా ఏర్పాటు కావడంతోపాటు ప్రజల ముంపు బాధలు శాశ్వతంగా తీరుతాయన్నారు. ప్రజల ప్రాణాలకు భద్రత, ఆస్తులకు రక్షణ ఏర్పడుతుందన్నారు. తీర ప్రాంత అభివృద్ధితోపాటు ఆహ్లాదకర పర్యాటకం, ప్రజా వినియోగ అవకాశాలు మెరుగుపడ్తాయన్నారు. గోదావరిఖని కోల్‌బెల్ట్ వంతెన, సమ్మక్క, సారాలమ్మ జాతర ప్రదేశం వద్ద గోదావరి తీరం ఒక అందమైన పర్యాటక ప్రాంతంగా మారుతుందన్నారు.

## డైరెక్టర్ స్థాయి అధికారిని చర్చలకు పంపాలి

### సింగరేణి యాజమాన్యంకు లేబర్ కమిషనర్ ఆదేశం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఇచ్చిన సమ్మె నోటీసుపై ఈ నెల 21 న హైదరాబాద్ లోని కేంద్ర అసిస్టెంట్ లేబర్ కమీషనర్ డా. శాస్వతి రాత్ ముందు రాజీ చర్చలు జరిగాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ఒక ప్రకటన లో పేర్కొన్నారు.ఈ చర్చలకు యూనియన్ తరపున అధ్యక్షులు వి. సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కె. రాజ్ కుమార్,అదనపు ప్రధాన కార్యదర్శి ఎం. రంగయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు కె. సారయ్య, కె. వీరభద్రయ్య, ఎం. సమయ్య, ఎం. ఎల్లగౌడ్ మరియు కేంద్ర కార్యదర్శి వై. రామ్ గోపాల్, యాజమాన్యం తరపున డిప్యూటీ జీఎం (పర్సనల్) బి. రాజ గోపాల్ హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు. ఈ చర్చల్లో సమ్మెను నివారించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని యాజమాన్యం తెలిపిందని, అయితే అర్థవంతమైన చర్చలు జరిగేందుకు నిర్ణయం తీసుకునే అధికారం ఉన్న డైరెక్టర్ స్థాయి సీనియర్ అధికారిని తదుపరి విచారణకు హాజరుపరచాలని సింగరేణి యాజమాన్యాన్ని లేబర్ కమీషనర్ ఆదేశించారని ఆయన పేర్కొన్నారు.రాజీ ప్రక్రియ పెండింగ్ లో ఉన్నందున సమ్మె చర్యకు దిగవద్దని, పారిశ్రామిక శాంతిని కాపాడాలని యూనియన్ కు సూచించారని, తదుపరి తుది చర్చలు ఈ నెల 27 న మధ్యాహ్నం 3 గంటలకు రీజియన్ హెడ్ ముందు జరుగుతాయని, అప్పటికీ పరిష్కారం కాకపోతే రాజీ నివేదిక (ఆర్.ఓ.సి) జారీ చేస్తామని లేబర్ కమీషనర్ తెలిపారని ఆయన పేర్కొన్నారు. కొన్ని కార్మిక సంఘాలు విషయం తెలిసి ఏఐటియుసి పై విమర్శలు చేయడం సరైంది కాదని, సమ్మె నోటీసు లో పేర్కొన్న డిమాండ్ ల పై అగ్రిమెంట్ జరుగకుంటె అన్ని కార్మిక సంఘాల కు చర్చలు వివరాలు వివరించి సమ్మె కు పిలుపు నిస్తామని, కనుక కార్మిక సోదరులు ఆందోళన చెందాల్సిన పని లేదని,కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఏఐటియుసి కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## మందుబాబులకు అడ్డాగా పాఠశాల ప్రాంగణం




**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం అంతార్గం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం కొన్ని సంవత్సరాల క్రితం నుంచి నిత్యం మందుబాబులకు అడ్డాగా మారుతోందని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పరిసరాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. అంతార్గం గ్రామం స్థానిక ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సొంత గ్రామం కావడంతో పాఠశాల పరిసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు నిఘా పెంచి, పాఠశాల ప్రాంగణంలో రాత్రివేళల్లో గస్తీ నిర్వహించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. విద్యార్థుల భద్రత, పాఠశాల పవిత్రతను కాపాడేందుకు విద్యాశాఖ, పోలీసు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టి,పాఠశాల ప్రాంగణాన్ని అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంచాలని గ్రామ ప్రజలు సంభందిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

## లక్ష్మీ నగర్ హౌస్ ఓనర్స్ అధ్యక్షులుగా ఎర్రోజు వేణుగోపాల్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పట్టణంలోని లక్ష్మీ నగర్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎర్రోజు వేణుగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ప్రధాన కార్యదర్శిగా గుర్రాల వీరేశం, కోశాధికారిగా గున్నాల శ్రీహరి,గౌరవాధ్యక్షులుగా ఎం శంకర్, గౌరవ సలహాదారులుగా కర్నాటి రవి కుమార్, ఉపాధ్యక్షులుగా కొమ్ము కరుణాకర్,పోగుల విజయ్ కుమార్, సహాయ కార్యదర్శులుగా చొప్పరి నర్సయ్య, గసికంటి కుమారస్వామి,ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆషాడం తిరుపతి,కొలేటి సంపత్, కార్యవర్గ సభ్యులుగా మెరుగు సంతోషం,లక్కెపురం సత్యనారాయణ,పాముకుంట్ల ప్రభాకర్ రెడ్డి,వి.తిరుమల్ రావు,నూనె మల్లేష్,కారుపాకల రామస్వామి, నీలం అంజయ్య, నీలారపు రాజన్న, సింగరవేని కనుకయ్య, తీగల రాజయ్య, బొడ్డుపల్లి లక్ష్మయ్య, బొల్లం సతీష్, రాజమౌళి, కుమారస్వామి, ఎస్. రవి కుమార్,ఎం.రాములు, జంగ సత్యనారాయణ రెడ్డి,మహ్మద్ తాజ్ లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు, కమిటీ సభ్యులందరిని పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో గ్రామ శాఖ అధ్యక్షుడు వాకిటి



**ప్రజాపక్షం /కథలాపూర్ :** రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అందిస్తున్నటువంటి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో భాగంగా కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నటువంటి మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాకిటి రాజారెడ్డి తో పాటు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తలారి మోహన్ లు మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మన తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్న బియ్యం పంపిణీ అందిస్తున్నారని గతంలో అందించిన రేషన్ కార్డులకంటే ఇప్పుడు అందిస్తున్న ఈ రేషన్ కార్డులు ఏ టీ ఏం సైజ్ లో ఉన్నందున పర్సులో కూడా పెట్టుకునే సౌకర్యవంతంగా ఉన్నాయని దానిపైన ఉన్న క్యూఆర్ కోడ్ ఆధారంగా లబ్ధిదారుల వివరాలు తెలుసుకోవచ్చని అలాగే నకిలీ కార్డుల నియంత్రణకు అనువుగా ఉంటుందని ఇవి ప్రజలందరికీ సౌకర్యవంతంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వారితోపాటు రేషన్ షాప్ డీలర్ శకుంతల,పులి ఆంజనేయులు తరి శేఖర్,ప్రతాప్ రెడ్డి,రాజేష్ యాదవ్‌లతోపాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది



**ప్రజాపక్షం /కథలాపూర్ :** భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పత్రికా విలేకరుల సమావేశం సిరికొండలో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోడిపెల్లి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా రైతులకు అనేక హామీలు ఇవ్వడం జరిగింది. రైతు గ్యారెంటీ పేరుతో ఈ రాష్ట్ర రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది గతంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం కూడా రైతులకు క్రాప్ లోన్స్ కు జీరో ఇంట్రెస్ట్ ఇవ్వక మోసం చేసిన సందర్భంలో ఈ కాంగ్రెస్ నాయకులు రైతు గ్యారెంటీల్లో భాగంగా రైతులకు గరిష్టంగా ఇచ్చే 3 లక్షల రుణానికి జీరో ఇంట్రెస్ట్ కు రుణాలు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టడం జరిగింది.కానీ ఈ రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలు నర గడుస్తున్న ఇప్పటివరకు రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలకు జీరో ఇంట్రెస్ట్ ఇవ్వడం లేదు రైతులు తీసుకునే వ్యవసాయ రుణాలకు సహకార సంఘాలు మరియు కమర్షియల్ బ్యాంకులు ఏడు శాతం వడ్డీని విధిస్తున్నారు.సక్రమంగా చెల్లించే రైతులకు కేంద్ర ప్రభుత్వం త్రీ పర్సెంట్ ఇంట్రెస్ట్ ను రైతుల ఖాతాలోకి నేరుగా జమ చేస్తుంది మిగిలిన నాలుగు పర్సెంట్ ఇంట్రెస్ట్ ను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కొడుపెల్లి గోపాల్ రెడ్డి డిమాండ్ చేస్తున్నాం లేని పక్షంలో రైతులతో కలిసి ఉద్యమాన్ని చేస్తామని ఆరు గ్యారెంటీలో భాగంగా రైతులకు చేస్తామన్న రుణమాఫీ పూర్తి స్థాయిలో ఇప్పటివరకు రుణమాఫీ జరగలేదు.ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యేలను డిమాండ్ చేస్తా ఉన్నాం మీ గ్రామాల్లో ఉన్న రైతులకు ఈ రుణమాఫీ జరిగిందా మీరు ఎక్కడ చర్చ పెడితే అక్కడికి రావడానికి భారతీయ జనతా పార్టీ సిద్ధంగా ఉన్నది అదేవిధంగా రైతులకు రైతు భరోసా ఇవ్వడంలో మరియు పనిముట్లు వ్యవసాయ పనిముట్లు అందించడంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది రైతులకు సరిపడా యూనియన్ కూడా సప్లై చేయడంలో విపల విఫలమైన సందర్భంలో రైతులకు సమాధానం చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఉన్నాం.

## హరికృష్ణకు బెస్ట్ ఎంప్లాయీ అవార్డు



**ప్రజాపక్షం / కౌటాల :** నిజామాబాద్‌కు చెందిన జిఆర్ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఇచ్చే బెస్ట్ ఎంప్లాయీ అవార్డుకు కౌటాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన సోయాం హరికృష్ణ ఎంపికయ్యారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన, విధి నిర్వహణలో చూపిన ప్రతిభ, అంకిత భావానికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. అవార్డు సాధించిన సోయాం మనోహర్ కుమారుడు హరికృష్ణను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు.

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

### ఎంపిడిఒ లవకుమార్

**ప్రజాపక్షం/ముధోల్ :** ప్రభుత్వ ఆదేశానుసారం నేటి నుండి ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముధోల్ ఎంపీడీఓ లవకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లకుండా మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో తమ అర్జీలను, ఫిర్యాదులను తెలపవచ్చన్నారు. ఇట్టి ప్రజవాణి కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమం లో దాదాపు 23 శాఖల అధికారులు పాల్గొనున్నట్లు వెల్లడించారు.అధికారులు సైతం ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించడానికి ప్రభుత్వ నిబంధనలనుసరిస్తూ సమయానికి హాజరు కావాలని కోరారు.

## గోసంగి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఈర్నాల



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** జిల్లా గోసంగి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూతనంగా జిల్లా కార్యవర్గం ఎన్నుకున్నారు. నూతన జిల్లా అధ్యక్షులు ఈర్నాల వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కడమంచి సతీష్, కోశాధికారి ఈర్నాల హన్మంత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ ఆశయాలకు సిద్ధాంతాలకు, భావాలకు కట్టుబడి ఉంటామని, గోసంగి జాతిని వద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయంగా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కొండపల్లి పోశెట్టి, గంధం ముదిరాజ్, ఈర్నాల లక్ష్మణ్, గంధం పరశురాం, పెంటన్న పాల్గొన్నారు.

## కవ్వాల్ టైగర్‌జోన్ జోన్ ఎత్తివేయాలని దీక్ష



**ప్రజాపక్షం / జన్నారం :** కవ్వాల్ టైగర్‌జోన్‌ను రద్దు చేయడంతో పాటు ఎకో సెన్సిటివ్ జోన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక పోరాట సమితి అధ్యక్షుడు భూమాచారి రిలే నిరాహారదీక్ష చేపట్టారు. శనివారం జన్నారంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దీక్షకు కూర్చున్నారు. కవ్వాల్ టైగర్‌జోన్ రద్దుపై ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. టైగర్‌జోన్, ఎకో సెన్సిటివ్ జోన్ నిబంధనలతో మండల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భూమాచారి అన్నారు. ముఖ్యంగా వాగులు, గోదావరి నుంచి చిన్నచిన్న అవసరాలకు ఇసుక తీసుకెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. స్థానికుల జీవనోపాధితో పాటు గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు కూడా నిబంధనలు ఆటంకంగా మారుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని కవ్వాల్ టైగర్‌జోన్, ఎకో సెన్సిటివ్ జోన్‌పై పునరాలోచించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న నిబంధనలను తొలగించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తామని భూమాచారి తెలిపారు.

## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

### సిపి పి.సాయి చైతన్య



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగంచేసుకుని, క్రమశిక్షణతో శిక్షణ పొంది పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. ఆదివారం పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో కానిస్టేబుల్, సబ్ ఇన్స్‌పెక్టర్ ఉద్యోగాల ఉచిత శిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు పోలీస్‌శాఖ తరపున ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీస్‌శాఖలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న ప్రతిభావంతులైన నిరుద్యోగ యువతకు ఈ కార్యక్రమం ద్వారా నాణ్యమైన శిక్షణ, అవసరమైన మార్గదర్శకత్వం అందించడమే పోలీస్ కమిషనరేట్ ప్రధాన ఉద్దేశమన్నారు. ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఆదివారం స్క్రీనింగ్ టెస్ట్‌ను సిపి సమక్షంలో నిర్వహించారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి, వారికి కానిస్టేబుల్, సబ్ ఇన్స్‌పెక్టర్ నియామక పరీక్షలకు అవసరమైన రాత పరీక్ష, ఫిజికల్ ఈవెంట్స్, తదితర అంశాల్లో సమగ్ర శిక్షణ అందించనున్నారు. ఈ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణలో అదనపు డిసిపి (అడ్మిన్) శుభం ప్రకాష్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, సిటిసి, ట్రాఫిక్, సిసిఎస్, ఏఆర్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ విభాగాలకు చెందిన ఏసిపిలు, ఇన్స్‌పెక్టర్లు, సి ఐలు, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలు, ఐటి కోర్ సి బ్బంది, పోలీస్ సిబ్బంది పరీక్ష నిర్వహణలో భాగస్వాములయ్యారు.

## అవుట్ సోర్సింగ్ జెఎసి మండల కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** తెలంగాణ రాష్ట్ర అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి ఆసిఫాబాద్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక ఆదివాసీ భవన సముదాయంలో వివిధ శాఖల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా సయ్యద్ యాసీన్ (రెవెన్యూ శాఖ), ప్రధాన కార్యదర్శిగా నగరారే అరుణ్ కుమార్ (నీటిపారుదల శాఖ), కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నాయకిని వెంకట స్వామి (అటవీ శాఖ), కోశాధికారిగా సోన్నాయిల హరీష్ (న్యాయశాఖ) ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెండ్యాల రాంచందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలోజు సంతోష్ కుమార్, కోశాధికారులు సోగాల రవి, జాడి సుఖ్దేవ్, జిల్లా ఉపాధ్యక్షుడు అంకుష్, మీడియా ఆర్గనైజర్ నవీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

## అర్వింద్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

### ఎంపి అర్వింద్ వ్యాఖ్యలపై మాజీ మేయర్ సంజయ్ తీవ్ర ఆగ్రహం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సిఎంపై ఎంపి అర్వింద్ నోరు పారేసుకోవటం మానుకోకపోతే కాంగ్రెస్ శ్రేణులు తగిన బుద్ధి చెబుతారన్నారు. అరవింద్ చేసిన అనుచిత, అహంకారపూరిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ సమాజం మెచ్చిన నాయకుడు సిఎం రేవంత్‌రెడ్డి అని నగర మాజీ మేయర్ సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు రాజకీయంగా, వివాదాపరంగా ఉండాలి కానీ ఇలా ఒక ముఖ్యమంత్రి శరీర ఆకృతిని కించపరుస్తూ మాట్లాడటం వ్యక్తిగత దూషణలకు దిగజారడం అర్వింద్ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. ఎంపి అర్వింద్‌ను సూటిగా అడుగుతున్నానని ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము ఉందా అన్నారు. సంస్కారం లేని రాజకీయం మీదన్నారు. ఎంపి పదవిలోని వ్యక్తి మాట్లాడాల్సిన భాష ఇదేనా ? మీ పార్టీ నేతలైన మీ భాషను సమర్థిస్తున్నారా ? నీతులు చెప్పడం నికృష్ట రాజకీయాలు చేయడమే మీ సిద్ధాంతమా అని ప్రశ్నించారు. అయినా మీ వ్యవహారమంతా వాషింగ్ పౌడర్ నిర్మా సిద్ధాంతమేగా అన్నారు. రాజకీయం చేతకాక, వ్యక్తిగత, శారీరక ఆకృతిపై మాట్లాడటం మీ సంస్కారహీనతను చూపిస్తోందన్నారు. ప్రజల గుండెల్లో ఉన్న నాయకుడు రేవంత్‌రెడ్డి అని ప్రజాబలంతో గెలిచిన నేత. మీలాంటి వారి అడ్డగోలు మాటలతో ఆయన ప్రతిష్ట తగ్గదన్నారు. జనబలం లేని మీ మాటల్ని ప్రజలు ఏ మాత్రం సమర్థించరన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజారంజక పాలన చూసి బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని అందుకే వారికి పిచ్చిముదిరి, పిచ్చికుక్కల్ల మాట్లాడుతున్నారన్నారు. నిజామాబాద్ అభివృద్ధి వదిలేసి, ప్రజలను అడుగడుగునా మోసం చేసిన చరిత్ర మీదన్నారు. భాష మార్చుకోకపోతే ఊరుకోమని, ఇకనైనా సిఎంపై నోరు పారేసుకోవటం మానుకోకపోతే కాంగ్రెస్ శ్రేణులు తగిన బుద్ధి చెబుతాయన్నారు. తెలంగాణ సంస్కృతిలో ఇటువంటి వ్యక్తిగత దూషణలకు తావు లేదు. అరవింద్ తక్షణమే సిఎం రేవంత్ రెడ్డి కి తెలంగాణ ప్రజలకు బేషరత్‌గా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. లేదంటే సభ్య సమాజం క్షమించదగదని గుర్తు చేస్తున్నామన్నారు.

## జన్నారం సెక్షన్ ఇన్‌ఛార్జ్‌గా మమత



**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం సెక్షన్ ఇన్‌ఛార్జ్‌గా డిఆర్ఓ మమతకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె జన్నారం రేంజ్‌లోని ల్యాండ్ అండ్ సర్వే విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ల్యాండ్ అండ్ సర్వే విభాగంలో తన విధులను కొనసాగిస్తూనే జన్నారం సెక్షన్ ఇన్‌ఛార్జ్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సెక్షన్ పరిధిలో అటవీ భూముల పరిరక్షణ, అక్రమ ఆక్రమణల నియంత్రణ, అటవీ ప్రాంతాల పర్యవేక్షణ తదితర అంశాల్లో సెక్షన్ ఇన్‌ఛార్జ్ కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మమతకు అప్పగించిన అదనపు బాధ్యతలతో జన్నారం సెక్షన్‌లో అటవీ శాఖ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని అధికారులు భావిస్తున్నారు.

## డాక్టర్ ధన్వల్కర్ సుధాకర్‌కు ఘన నివాళి



**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ధన్వల్కర్ సుధాకర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్నులే మెంగాజీ సుధాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, ప్రజలకు సుధాకర్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ, ఉపాధ్యక్షులు సెల్వట్కర్ పెంట్టు, కడప మారుతి, సామల రమేష్, ప్రధాన కార్యదర్శి సెండే హనుమంతు, కార్యదర్శులు వడ్లూరి లింగమూర్తి, ఉప్రే ధ ర్మాజీ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చునర్కర్ శివాజీ, నాయకులు మల్లయ్య, మండకర్ ధథాజీ, షేక్ అజ్మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ స్లాబు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి మండల కేంద్రంలోని లక్ష్మీ నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం స్లాబు పనులను సర్పంచ్ చునార్కర్ సతీష్ (సోను) కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తయి భక్తులకు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. దేవస్థాన నిర్మాణానికి సహకరిస్తున్న దాతలు, కాలనీ ప్రజలను ఆయన అభినందించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దీపక్ ముండే, ఆలయ కమిటీ సమన్వయకర్త దుర్వ సునీల్, మాజీ సర్పంచ్ బండె తుకారాం, యువ నాయకుడు జాడే తిరుపతి, డైలీ క్రికెట్ యూత్ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఏడుగురు ఎంపిక

**ప్రజాపక్షం / మందమర్రి :** మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో రాణించి ఈ ఘనత సాధించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన అక్షిత, ప్రణవి, పవిత్ర, వైష్ణవి, కల్పన, సాయి అక్షిత, శారద అర్హత పొందారు. వీరంతా ఈ నెల 28వ తేదీ నుంచి నిజామాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. పాఠశాలలో విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుండటంతో విద్యార్థులు ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారు. రాష్ట్రస్థాయిలోనూ విద్యార్థులు క్రమశిక్షణతో పాల్గొని పతకాలు సాధించాలని తల్లిదండ్రులు, స్థానికులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల, పిడి విశాల హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

**ప్రజాపక్షం /సంగారెడ్డి :** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నారాయణఖేడ్ నియోజకవర్గ పర్యటనలో నారాయణ ఖేడ్ పట్టణంలో ఆధునికంగాఏర్పాటు చేసిన బాలాజీ అనురాధ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహ స్థానిక శాసన సభ్యులు డా.సంజీవరెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి లోని అన్ని విభాగాలను మంత్రి పరిశీలించారు. నారాయణఖేడ్ ప్రాంత వైద్య అవసరాలను దృష్టిలో పెటుకొనిఏర్పాటు చేసిన ఆసుపత్రి నిర్వాహకులను మంత్రి అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్య రంగాల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అందిస్తున్న సేవలకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. ఈ కా ర్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ,జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నారాయణ ఖేడ్, సబ్ కలెక్టర్ హరిణి, ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ పట్లోళ్ల అనురాగ్ రెడ్డి , డాక్టర్ కె. శ్రీధర్ స్థానిక ప్రజా ప్రతినిధులు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయుడు వీరయ్యకు పరామర్శ

**ప్రజాపక్షం /సంగారెడ్డి :** అందోల్ నియోజకవర్గంలోని చౌటకూరు మండల కేంద్రంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు వీరయ్యను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరామర్శించారు. వీరయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వీరయ్య కుమారుడు మనిపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్నారు. వారి తండ్రి వీరయ్యను మంత్రి పరామర్శించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం



**ప్రజాపక్షం /సంగారెడ్డి :** కంది మండలం ఇంద్రకరణ్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి హాజరై నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని అన్నారు. ప్రతి కుటుంబానికి సొంత ఇళ్లు ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పేద ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ ఇళ్లు నిలుస్తున్నాయన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల అంజనేయులు మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్, నాయక్ కంది మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ మొగులయ్య ,మెతిలాల్ నాయక్, సర్పంచ్ శంకరి రాజు ,ఉప సర్పంచ్ కొన్యాల లావణ్య ,రాజేందర్ రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఎరువుల సొమ్ము స్వాహాలో బ్లేమ్ గేమింగ్



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వెలుగుచూసిన రూ. 28లక్షల నిధుల స్వాహా వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూ బ్లేమ్ గేమింగ్ కొనసాగుతున్నట్లు కనబడుతోంది. కొన్నేండ్లుగా సాగుతున్న ఎరువుల అమ్మకాల సొమ్మును సేల్స్‌మెన్లు సొంతానికి వాడుకున్న తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాధనం, రైతుల సొమ్ము కాపాడాల్సిన చోట ఇంత భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయని తెలిసినా అధికారులు మౌనం వహించడం వెనుక అంతర్యం ఏమిటని రైతాంగం ప్రశ్నిస్తుంది. కేవలం కింది స్థాయి సిబ్బంది అయిన సేల్స్‌మెన్లు మాత్రమే ఇంత భారీ మొత్తంలో రూ. 28లక్షల నిధులు కాజేయడం సాధ్యమేనా..? అనే తీవ్ర చర్చ నడుస్తుంది. ఏళ్ల తరబడి లెక్కల్లో తేడాలు వస్తున్నా, ఆడిటింగ్ ప్రక్రియ జరుగుతున్నా జిల్లా స్థాయి అధికారులు ఏ ఒక్కరూ ఈ సొసైటీ వైపు కన్నెత్తి చూడకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుంది. ఉన్నతాధికారుల అండదండలు లేకుండా లేదా సొసైటీ వర్గాల నిర్లక్ష్యం లేకుండా ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోవడం సాధ్యం కాదని రైతులు ఆరోపిస్తున్నారు. ఓవైపు నిధుల దుర్వినియోగంలో తమ పాత్ర ఏమీ లేదని, తమకు ఎలాంటి సంబంధం లేదంటూ సదరు సేల్స్‌మెన్లు పేర్కొంటున్నారు. మరోవైపు కొందరు డైరెక్టర్లు మాత్రం దీనికి సెక్రెటరీనే పూర్తి బాధ్యత వహించాలని సూటిగా డిమాండ్ చేస్తున్నారు. పాలకవర్గం, అధికారుల మధ్య నడుస్తున్న ఈ బ్లేమ్ గేమింగ్‌లో అసలు నిందితులు బయటకు రావడం లేదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇంత పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగినా జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఎడపల్లి సొసైటీపై సమగ్ర విచారణ జరిపించి, అసలు సూత్రధారులు, పాత్రధారులను చట్టం ముందు నిలబెట్టాలని, బ్లేమ్ గేమింగ్‌కు ఫుల్ స్టాప్ పెట్టాలని రైతులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## టెండర్ అప్రూవల్ కాపీని అందచేసిన మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/తానూర్ :** తానూరు మండల కేంద్రం లోని శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయ నిర్మాణం టెండర్ అప్రూవల్ కాపీని ముదిరాజ్ సోదరులకు ఆదివారం పెద్దమ్మ తల్లి దేవాలయం ఆవరణంలో మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి అందజేశారు.నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,దేవాదయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణ రావుకు ముధోల్ మాజీ శాసనసభ్యులు విఠల్ రెడ్డి కు ముదిరాజ్ సంఘం తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాదవ్ మాధవ్ రావు పటేల్,మాజీ సర్పంచ్ రాములు, పిఎసిఎస్ చైర్మన్ నారాయణ రావు పటేల్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పోశెట్టి,ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సాయినాథ్,మాజీ ఎంపీపీ రాజన్న, మాజీ జడ్పీటీసీ ఉత్తమ్ బాలేరావు,మాజీ ఆత్మ చైర్మన్ పోతారెడ్డి,ధర్మోడ్ సుభాష్, చింతలోడ్ లక్ష్మణ్,ముదిరాజ్ కుల సంఘం సోదరులు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## పాపహరేశ్వరస్వామిని దర్శించుకున్న అదనపు కలెక్టర్



**ప్రజా పక్షం /దిలావర్ పూర్ :** నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కదిలి శ్రీ పాపహరేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ ఆదివారం రోజున కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఆలయానికి చేరుకున్న అదనపు కలెక్టర్ కు ఆలయ చైర్మన్ వెంకట్రావు పటేల్, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. భక్తుల శ్రేయస్సు, జిల్లా సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఆయన మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం ఆలయ చైర్మన్ వెంకట్రావు పటేల్ అదనపు కలెక్టర్ కు స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కదిలి పాపహరేశ్వరస్వామి ఆలయ చరిత్ర, విశిష్టత, స్థల పురాణాన్ని ఆయనకు వివరించారు.ఎంతో పురాతనమైన ఈ ఆలయాన్ని దర్శించుకుంటే సర్వపాపాలు హరించబడతాయని భక్తుల నమ్మకమని తెలిపారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ కాలనీ వాటర్ ట్యాంక్ ప్రాంతంలోని పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ గణపతి హోమం, గర్తవాసం, బీజన్యాసం, మండపార్చన వంటి శాస్త్రోక్త పూజా క్రతువులు నిర్వహించారు. కన్యా లగ్నంలో పోచమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు జరిపారు. అనంతరం ఎంఎల్‌సి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో మంచిర్యాల నగర మేయర్ ధర్ని మధుకర్, మాజీ ఎంఎల్‌ఎ నడిపెల్లి దివాకర్‌రావు, డిసిసి మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, కార్పొరేటర్ బండారి సుధాకర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్కాల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇసంపెల్లి ప్రభాకర్, మాజీ సర్పంచ్ జక్కుల రాజేశం, నాయకులు విచిత్ర, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డితో పాటు వేద పండితులు అరుణ్ శర్మ, అఖదీప్ శర్మ, అభిషేక్ శర్మ, సచిన్ శర్మ, గణేష్ శర్మ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వీర్నపల్లిలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** చిన్నారులకు అండగా నిలుస్తూ అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్న హిమాన్స్ మరియు అమృత హాస్పిటల్ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సురేంద్రబాబు ను పలువురు ప్రశంసించారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఆదివారం చిన్న పిల్లలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేంద్ర బాబు మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా చిన్న పిల్లలకు దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులు త్వరగా వ్యాప్తి చెందుతాయని ప్రారంభంలోనే తగు జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జక్కుల నరేష్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నూతన చైర్మన్, డైరెక్టర్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ఎడపల్లి:** పవిత్ర పుణ్యక్షేత్రమైన ఎడపల్లి మండలం జానకంపేట్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఎన్నికైన చిలుక రవి కుమార్, డైరెక్టర్‌గా ఎన్నికైన ఉదుత గంగాధర్‌లను పద్మశాలి సంఘం ప్రతినిధులు ఆదివారం ఘనంగా సన్మానించారు. జానకంపేట్ గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్, డైరెక్టర్‌లకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఒకరికొక్కరు స్వీట్లు తినిపించుకొని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బిల్లా గంగాధర్ మాట్లాడుతూ.. తమ సంఘానికి చెందిన నాయకులు ఆలయ ధర్మకర్తల మండలిలో కీలక పదవులకు ఎన్నిక కావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యార్థం నూతన పాలక మండలి విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు, నాయకులు చిలుక వినోద్, ఉదుత పోతన్న, జిల్లా బాలరాజ్, చిలుక కిరణ్, బాలశెట్టి రాజు, బిల్లా చిన్నా సాయిలు, బిల్లా పెద్ద సాయిలు, రాపల్లి నవీన్, ఉదుత చిన్న గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## సెలవు రోజున ప్రైవేటు పాఠశాలలను నడపడమేంటి?



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలను బంద్ నిర్వహించామని ఎల్లారెడ్డిపేట మండల ఏబీవీపీ కన్వీనర్ ఆదారవేణి కృష్ణ మీడియాతో వెల్లడించారు.ఆదివారం సైతం పాఠశాలలను నడిపి పిల్లల మానసిక ఒత్తిడికి గురి చేయడం సరియైంది కాదని మండి పడ్డారు.లాభాపేక్షతో విజ్ఞాన్,శ్రీచైతన్య,జ్ఞానదీప్ పాఠశాలను ఆదివారం రోజున నడిపించినందున ప్రభుత్వ నిబంధనలు పాతరవేస్తున్నారని ఆరోపించారు.ఇష్టానుసారంగా పాఠశాలలను నడిపిస్తున్నందున విద్యార్థుల స్వేచ్ఛను హరిస్తున్నారని మండిపడ్డారు.ప్రైవేటు,కార్పొరేటు పాఠశాలలను నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తే గుర్తింపు రద్దు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్న పట్టించుకోవడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని అన్నారు. కార్యక్రమంలో అదరవేణి కృష్ణ, అభి, రాజు, శివ విద్యార్థి విభాగం ఏబివిపి నాయకులు ఉన్నారు.

## సీతారామచంద్రులకు వెండి కానుకల సమర్పణ

**ప్రజాపక్షం /ముస్తాబాద్:** పోతుగల్ గ్రామంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి, శివకేశవ ఆలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామివారికి భక్తులు రూ. 5 లక్షల విలువగల వెండి కానుకలను ఘనంగా సమర్పించారు. బాలయ్య తన్నీరు భారతీయ రాజేశ్వరరావు, వారి కుమారుడు ప్రసాద్ రావు మరియు సరిత దంపతులు స్వామివారి సేవలో భాగస్వాములై, సుమారు 2 కేజీల బరువు కలిగిన వెండి తీర్థ పాత్రలు, మంగళహారతి వెండి సెట్‌ను ఆలయ అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా పోతుగల్ గ్రామ సర్పంచ్ యాదమ్మ శ్రీనివాస్ గారు దాతల ఉదారతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్వామివారికి భక్తిశ్రద్ధలతో కానుకలు సమర్పించిన దాతల కుటుంబానికి శ్రీ సీతారామచంద్ర స్వామివారి మరియు ఆంజనేయ స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. వారి కుటుంబం ఆయురారోగ్యాలతో, సకల ఐశ్వర్యాలతో ఉన్నత స్థానాల్లో వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు మరియు భక్తులు పాల్గొని దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు.

## భరత కుమార్‌కు మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి సన్మానం



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్‌:** ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు, జర్నలిజం రంగంలో సేవలందిస్తున్న చీర భరత్‌కుమార్‌కు మదర్ థెరిసా అవార్డు లభించడంపై 40వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భరత్ కుమార్‌ను ఆయన శాలువాతో సత్కరించి అభినందించారు. వరంగల్ శాఖరాశికుంటలోని శ్రీ రాశ్రీ గార్డెన్స్‌లో ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో సేవలందించిన వారికి నిర్వాహకులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భరత్‌కుమార్‌కు మదర్ తెరిసా అవార్డు అందజేశారు. అనంతరం మరుపల్ల రవి మాట్లాడుతూ అవార్డులు అందుకోవడం ద్వారా వ్యక్తులు చేస్తున్న సేవలకు గుర్తింపు లభించడంతో పాటు, భవిష్యత్తులో మరింత సేవ చేయడానికి ప్రోత్సాహం లభిస్తుందన్నారు. భరత్‌కుమార్‌కు భవిష్యత్తులో మరిన్ని అవార్డులు రావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రయివేట్ ఉపాధ్యాయులు జంజీరాల మహేందర్, మంద నాగరాజు, కందగట్ల విజయ్‌కుమార్, చెక్క రవి, పూల నవీన్, పరిమళ్ల కిరణ్, బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మరుపల్ల గౌతం, తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన నాగూర్ల వెంకన్న

**ప్రజాపక్షం /నడికూడ :** నడికూడ మండల కేంద్రానికి చెందిన ఎండిగా సుజాత–రాజేశ్వరరావు దంపతుల పుత్రిక తేజ శ్రీ–అనిల్‌ల వివాహ మహోత్సవం కన్నుల పండువగ ఘనంగా నిర్వహించారు.ఈ వివాహ వేడుకకు తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు(వెంకన్న)హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వధూవరులతో కొద్దిసేపు ముచ్చటించిన నాగూర్ల వెంకటేశ్వర్లు,వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు నూతన వధూవరులను ఆశీర్వదించిన వారిలో ఉన్నారు.

## నారాయణపూర్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కుంట్ల అశోక్

**ప్రజాపక్షం/వెంకటాపూర్ రామప్ప :** నారాయణపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీ కార్యవర్గం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కుంట్ల అశోక్, ఉపాధ్యక్షుడిగా మండల తిరుపతి, ప్రధాన కార్యదర్శులుగా అజ్మీరా సంతోష్, లోట పెట్టేల సుధాకర్, గుగులోత్ ప్రేమ్ సింగ్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కుంట్ల అశోక్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎల్లవేళలా పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని,గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై పోరాడుతానని, పార్టీ కోసం అహర్నిశలు పని చేస్తాను అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గ్రామ పెద్దలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి మద్దతు తెలిపారు.

## సెప్టెంబర్ 9న వరంగల్‌లో ఎంఆర్‌పిఎస్ జాతీయ సమావేశం



**ప్రజాపక్షం/గూడూరు:** పద్మశ్రీ ముందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ నూతన మండల స్థాయి జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ గూడూరు మండల ఇన్‌చార్జ్ కొమ్ము నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు.ఆదివారం గూడూరు మండలంలోని ఎమ్మార్పీఎస్ కార్యక్రర్తల సమావేశం నిర్వహించి గ్రామాల వారిగా కమిటీల ఏర్పాటుపై చర్చించారు.ఈసందర్భంగా నాగరాజు మాదిగ మాట్లాడుతూ గూడూరు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో నూతన కమిటిలను పూర్తిచేసి సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే జాతీయ సమావేశానికి పెద్ద సంఖ్యలో ఎమ్మార్పీఎస్ శేణులు తరలిరావాలని కోరారు. నూతన తరాన్ని ఎమ్మార్పీస్ ఉద్యమంలో ఒక సైన్యంలా తీర్చిదిద్దాలని భవిష్యత్తులో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ తీసుకోబోయే నిర్ణయాలకు ఎమ్మార్పీఎస్ శేణులంతా సిద్దంగా ఉండాలని అన్నారు.అనంతరం గూడూరు గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కందిక అశోక్ మాదిగ ప్రధాన కార్యదర్శ కందిక రాజుకుమార్ మాదిగ ఉపాధ్యక్షుడిగా కందిక అరుణ్ మాదిగ కోశాధికారిగా మైదం రాంబాబు మాదిగ అధికార ప్రతినిధిగా కందిక శ్రీరామ్ మాదిగ కార్యదర్శిగా కందిక రాజశేఖర్ మాదిగలను ఉన్నుకున్నారు.గౌరవ సలహాదారులుగా కందిక పెద్ద ఐలయ్య మాదిగ కందిక చిన్న ఐలయ్య మదిగ కందిక రమేష్ మాదిగ కందిక యాకయ్య మాదిగ కందిక కృష్ణ మాదిగ కందిక కొమురయ్య మాదిగ మైదం లక్ష్మ య్య మాదిగ తదితరులు పాల్గోన్నారు.

## శివగంగేశ్వర స్వామి ఆలయ మంటప ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** బీజేపీ జిల్లా నాయకులు షేర్ల అనిల్ ఆహ్వాన మేరకు స్విమ్మర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దామెర చెరువు గట్టు పైన అంగరంగ వైభవంగా ఏర్పాటు చేసిన శివగంగేశ్వర స్వామి ఆలయ మంటప ప్రారంభోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు గంట రవికుమార్ హాజరై శివగంగేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ హిందూ ధర్మం అనేది కేవలం ఒక మతం మాత్రమే కాదని, సనాతన సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప జీవన విధానమని అన్నారు. మన పూర్వీకులు అందించిన ఆధ్యాత్మిక సంపదను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఆలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా, ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలకు కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. యువతకు మన సనాతన ధర్మం గొప్పతనాన్ని తెలియజేస్తూ, దేవాలయాల పరిరక్షణ, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.శివగంగేశ్వర స్వామివారి ఆశీస్సులతో నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.భక్తి, ఆధ్యాత్మికతను పెంపొందించే కార్యక్రమాలను నిర్వహిస్తున్న షేర్ల అనిల్ మరియు స్విమ్మర్ అసోసియేషన్ సభ్యులను ఆయన అభినందించారు.

## అనారోగ్య నాయకులకు పరామర్శ



**ప్రజాపక్షం/నెక్కొండః** అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల ఇంటికి చేరుకున్న అలంకానిపేట గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ చైర్మన్ గుంటుక సోమయ్య, వార్డు సభ్యుడు సొల్లేటి రవికుమార్‌లను పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. మాజీ ఎంపిపి, మాజీ ట్రిబ్యూలర్ సభ్యుడు గటిక అజయ్‌కుమార్, న్యాయవాది కొమ్ము రమేష్ యాదవ్ తదితరులు శనివారం అలంకాపేటలోని వారి నివాసాలకు వెళ్ళి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ వారితో కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడారు. రాజకీయ అనుబంధాలకు అతీతంగా అనారోగ్య సమయంలో పరామర్శించడం మానవీయ విలువలకు నిదర్శనమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాటిపల్లి శివ కుమార్, వీరస్వామి, వడ్డే సురేష్, వీరభద్రం తదితరులతో పాటు అలంకానిపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల శానిటేషన్ వర్కర్లను గుర్తించాలి




**ప్రజాపక్షం/గూడూరు:** మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ వర్కర్ల సమావేశం మాదాసు ఎల్లయ్య అధ్యక్షతన జరిగింది.ముఖ్యఅతిథిగా హాజరైన యూనియన్ రాష్ట్ర కమిటి సభ్యుడు ఇసంపల్లి సైదులు మాట్లాడుతూ దశాబ్దాలుగా పాఠశాలల పరిశుభ్రత కోసం సేవలందిస్తున్న శానిటేషన్ వర్కర్లను ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం అమలు చేయడంతో పాటు వేతనం అమలు చేయడంతో పాటు వేతనాలను నేరుగా వక్కర్ల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. విధుల్లో మరణించిన వర్కర్ల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకొవాలని ప్రభుత్వాన్ని కోరారు.అనంతరం బాషికాల బాబుకు నాయకులు నివాళుర్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నెమ్మది వెంకటేశ్వర్లు నాయకలు చాగంటి రవి ధర్యారపు ప్రకాష్ సురేష్ వెంకన్న తదితరులు పాల్గోన్నారు.

## ప్రతి ఇంటికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించాడమే లక్ష్యం



**ప్రజాపక్షం/ఖానాపురం:** ప్రతి ఇంటికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించాడమే లక్ష్యంమని ఖానాపురం సర్పంచ్ దాసరి రమేష్ అన్నారు. పెద్దమ్మ గడ్డ తండాలో జుగా ప్రోగ్రాం కింద నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించాలనే ముఖ్య ఉద్దేశంతో జుగా ప్రోగ్రాం కింద తండా మొత్తం నూతన విద్యుత్ లైన్లను, స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాత లైన్ల వల్ల తరచూ లోవోల్టేజీ, విద్యుత్ అంతరాయం సమస్యలు ఉండేవని, విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో ఈ నూతన లైన్ల పనులు చేపట్టాడం జరిగిందన్నారు. దీని ద్వారా తండాలోని ప్రతి కుటుంబానికి నాణ్యమైన కరెంటు అందనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉప్పు రాజు, వార్డు సభ్యులు గుండ్లపల్లి విజయ్, గ్రామస్తులు పల్నాటి శ్రీనివాస్, వల్లెపు శ్రీనివాస్, కందుల సాంబయ్య, భూక్య నవీన్, గుగులోతు గణేష్ పాల్గొన్నారు.

## రిపోర్టర్‌పై దాడి కేసులో మరో ఇద్దరి లొంగుబాటు

**ప్రజాపక్షం/చిట్యాల:** చిట్యాలలో ఆర్‌బీ న్యూస్ రిపోర్టర్ పుల్ల రవీందర్‌పై దాడి కేసులో పరారీల ఉన్న మరో ఇద్దరు ప్రధాన నిందితులు ఆదివారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. కాటారం డిఎస్‌పి ఎ సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16న రాత్రి రవీందర్ ఇంట్లోకి చొరబడిన నిందితులు ఆయనపై దాడి చేయడంతో పాటు ఇంట్లోని సామాగ్రిని ధ్వంసం చేశారు. ఈ కేసులో ఇప్పటికే బొజ్జం వేణు, మెంగని నటరాజ్, మొక్కిరాల ప్రణయ్, గోలి అఖిల్‌లను ఈ నెల 19న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు మొక్కిరాల మధువంశీ కృష్ణ(ఏ1), ఎండి ఆరిఫ్(ఏ8) పోలీసుల గాలింపు ముమ్మరం కావడంతో ఆదివారం మధ్యాహ్నం కాటారం డిఎస్‌పి ఎదుట లొంగిపోయారు. వారి నుండి దాడికి ఉపయోగించిన చాక్లెట్ రంగు హోండా సిటీ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహణం నంబర్ టిఎస్07ఈవి9852గా పోలీసులు తెలిపారు. కారును సీజ్ చేసిన అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని భౌతిక దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి ఎ సూర్యనారాయణ హెచ్చరించారు.

## విరహత్ అలీ మాతృమూర్తి మృతికి జర్నలిస్టు నాయకుల సంతాపం

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్‌:** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టియూడబ్ల్యూజే..ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు కె విరహత్ అలీ మాతృమూర్తి బాషారత్ ఉన్నిసా బేగం అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున గజ్వేల్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న యూనియన్ రాష్ట్ర నాయకులు పిన్నా శివకుమార్, టియూడబ్ల్యూజే..ఐజేయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాం రామచందర్, ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, సీనియర్ నాయకుడు నార్లగిరి యాదగిరి గజ్వేల్‌కు చేరుకొని విరహత్ అలీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాషారత్ ఉన్నిసా బేగం మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం భగవంతుడు ప్రసాదించాలని వారు ప్రార్థించారు.

## బొల్లం కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి

**ప్రజాపక్షం/కమలాపూర్‌:** మండలంలోని శంభునిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొల్లం రాజిరెడ్డి మాతృమూర్తి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి ఆదివారం పరామర్శించి ప్రగాడ సానుభూతి వ్యక్తం చేశారు. బొల్లం తిరుపతి రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రాజేశ్వర్ రావు, గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.